నేటి మ్యాచ్
భారత్ X నెదర్లాండ్స్
మ. 2.00 నుంచి
వేదిక: బెంగళూరు

ఎదురుందా!

నేడు నెదర్లాండ్స్‌తో భారత్ ఢీ

కోహ్లీపై నజర్

వన్డే ప్రపంచకప్‌లో అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న టీమ్‌ఇండియా నేడు నెదర్లాండ్స్‌తో తలపడనుంది. ఇప్పటికే సెమీస్‌కు చేరిన రోహిత్ సేన విజయాల జోరు కొనసాగించాలని చూస్తుంటే.. ఈ టోర్నీలో అంచనాలకు మించి రాణించి రెండు విజయాలు ఖాతాలో వేసుకున్న నెదర్లాండ్స్ మరో సంచలనం నమోదు చేయాలని తహతహలాడుతున్నది. సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోవడం ఖయామైన నేపథ్యంలో.. డచ్ జట్టుతో పోరును మనవాళ్లు రిహార్సల్‌గా వినియోగించుకోవాలని చూస్తున్నారు. భారీ స్కోర్లకు నెలవైన బెంగళూరులో దీపావళి నాడు కింగ్ కోహ్లీ 50వ వన్డే సెంచరీ నమోదు చేసుకుంటాడా చూడాలి!

బెంగళూరు: స్వదేశంలో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో ప్రత్యర్థులందరినీ చిత్తు చేసి అజేయంగా నిలిచిన భారత్.. ఆదివారం టోర్నీ చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌ను ఢీకొంటున్నది. ఆడిన 8 మ్యాచ్‌ల్లో విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన రోహిత్ సేన.. బుధవారం తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్‌తో తలపడనుండగా.. దానికి ముందు బెంగళూరులో నేడు డచ్ జట్టుతో పోరుకు సిద్ధమైంది. విరాట్ కోహ్లీకి సొంత మైదానం లాంటి చిన్నస్వామి స్టేడియంలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ వన్డే సెంచరీల (49) రికార్డును అధిగమించాలని యావత్ భారతావని ఆశిస్తోంది. పండుగ పూట కోహ్లీ ఆ ఫీట్ సాధిస్తే.. అది మరింత మధురంగా మారడం ఖాయమే. టీమ్ పరంగా భారత్‌కు పెద్దగా సమస్యలు కనిపించడం లేదు. తుది జట్టులో ఎలాంటి మార్పులకు అవకాశం లేదు. బ్యాటింగ్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ మంచి టచ్‌లో ఉండగా.. బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, షమీ దుమ్మురేపుతున్నారు. గత మ్యాచ్‌ల్లో మహామహా జట్లనే వణికించిన భారత బౌలింగ్‌ను డచ్ ప్లేయర్లు ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. గత మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై సూపర్ సెంచరీతో చెలరేగిన విరాట్ కోహ్లీపై భారీ అంచనాలు ఉండగా.. ఐపీఎల్లో తన హోం గ్రౌండ్ అయిన బెంగళూరులో అతడికి అభిమానుల నుంచి మస్తు మద్దతు లభించనుంది. ఇక నాకౌట్ మ్యాచ్‌లకు ముందు సూర్యకుమార్ యాదవ్ నుంచి కూడా భారీ ఇన్నింగ్స్ వస్తే.. మేనేజ్‌మెంట్ బెంగ తీరినట్లే. ఈ టోర్నీలో ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన సూర్య 21.25 సగటుతో 85 పరుగులు చేశాడు. కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా స్పిన్ బాధ్యతలు చూసుకోనున్నారు.

మరోవైపు దక్షిణాఫ్రికా వంటి పెద్ద జట్టుపై విజయంతో టోర్నీలో ప్రకంపనలు రేకెత్తించిన నెదర్లాండ్స్ ఆ తర్వాత అదే తీవ్రత కొనసాగించలేకపోయింది. బంగ్లాదేశ్‌పై మాత్రమే గెలిచింది. చాంపియన్స్ ట్రోఫీ (2025)కి అర్హత సాధించాలంటే ఈ మ్యాచ్‌లో భారత్‌పై తప్పనిసరిగా గెలువాల్సిన పరిస్థితుల్లో నెదర్లాండ్స్ బరిలోకి దిగుతున్నది. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్‌తో పాటు అకెర్‌మన్, వాన్ బీక్, బాస్ డీ లీడ్, మీకెరెన్‌పై ఆ జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. తెలుగు ఆటగాడు తేజ నిడమనూరు తుది జట్టులో ఉండటం ఖాయమే.

ఎడ్వర్డ్స్

స్టోక్స్ (84)

ఇంగ్లండ్ చేతిలో ఓటమి

అయ్యో.. పాకిస్థాన్!

కోల్‌కతా: వన్డే ప్రపంచకప్ నాకౌట్ రేసులో నిలువాలంటే భారీ తేడాతో గెలువాల్సిన మ్యాచ్‌లో పాకిస్థాన్ పూర్తిగా తడబడింది. మ్యాచ్ ఆరంభానికి ముందే.. టాస్ రూపంలో ఆశలు వదిలేసుకున్న పాక్.. ఆ తర్వాత మైదానంలో బౌలింగ్, బ్యాటింగ్‌లో ఏమాత్రం ఆకట్టుకోలేకపోయింది. శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 93 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో పరాజయం పాలైంది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో 7వ స్థానంలో నిలిచిన ఇంగ్లండ్ చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించగా.. తొమ్మిది మ్యాచ్‌ల్లో ఐదో పరాజయంతో పాక్ పట్టికలో ఐదో స్థానానికే పరిమితమైంది. మొదట ఇంగ్లండ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగులు చేసింది. బెన్ స్టోక్స్ (84; 11 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా.. జో రూట్ (60), బెయిర్‌స్టో (59) రాణించారు. పాకిస్థాన్ బౌలర్లలో రవుఫ్ 3.. షాహీన్, వసీమ్ చెరో రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. భారీ లక్ష్యాన్ని 6.4 ఓవర్లలో ఛేదిస్తే.. నెట్ రన్‌రేట్‌లో న్యూజిలాండ్‌ను దాటి ముందంజ వేసే అవకాశం ఉండగా.. పాక్ 43.3 ఓవర్లలో 244 పరుగులకు కుప్పకూలింది. ఆగా సల్మాన్ (51) అర్ధశతకం సాధించగా.. షఫీఖ్ (0), ఫఖర్ జమాన్ (1), ఇఫ్తికార్ (3), షాదాబ్ (4) విఫలమయ్యారు. కెప్టెన్ బాబర్ (38), రిజ్వాన్ (36), రవుఫ్ (35; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే పరిమితమైంది. ఇంగ్లండ్ బౌలర్లలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' విల్లీ 3 వికెట్లు పడగొట్టాడు.

అప్పుడు తండ్రి.. ఇప్పుడు కొడుకు

వన్డే ప్రపంచకప్‌లో ఇప్పటి వరకు భారత్, నెదర్లాండ్స్ మధ్య రెండు (2003, 2011) మ్యాచ్‌లు జరగగా.. రెండింట టీమ్‌ఇండియా విజయం సాధించింది. 2003 మెగాటోర్నీలో తన బౌలింగ్‌తో టీమ్‌ఇండియాను వణికించి నాలుగు వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన టిమ్ డీ లీడ్ కొడుకు బాస్ డీ లీడ్ ప్రస్తుత జట్టులో సభ్యుడిగా ఉండటం విశేషం

ప్రపంచ కప్ పాయింట్ల పట్టిక

దే	ఆ	గె	ఓ	ర.రే.	పా
భారత్ ✓	8	8	0	+2.45	16
దక్షిణాఫ్రికా ✓	9	7	2	+1.26	14
ఆస్ట్రేలియా ✓	9	7	2	+0.84	14
న్యూజిలాండ్ ✓	9	5	4	+0.74	10
పాకిస్థాన్ X	9	4	5	-0.19	8
అఫ్గానిస్థాన్ X	9	4	5	-0.33	8
ఇంగ్లండ్ X	9	3	6	-0.57	6
బంగ్లాదేశ్ X	9	2	7	-1.08	4
శ్రీలంక X	9	2	7	-1.41	4
నెదర్లాండ్స్ X	8	2	6	-1.63	4

నోట్: దే: దేశం, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర: రన్‌రేట్, పా: పాయింట్స్

బాదుడే.. బాదుడు

బెంగళూరు పిచ్ బ్యాటింగ్‌కు స్వర్గధామం. భారీ స్కోర్లు ఖాయమే. ఇక్కడ జరిగిన గత రెండు మ్యాచ్‌ల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్లు వరుసగా 367, 401 పరుగులు చేశాయి. మ్యాచ్ కు వర్షసూచన లేదు.

సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 306/8 (తౌహిద్ 74, నజ్ముల్ 45; జాంపా 2/32, అబాట్ 2/61), **ఆస్ట్రేలియా:** 44.4 ఓవర్లలో 307/2 (మార్ష్ 177 నాటౌట్, స్మిత్ 63 నాటౌట్; తస్కిన్ 1/61).

ప్రపంచకప్ @ 10 లక్షలు

అహ్మదాబాద్ : ప్రస్తుత వన్డే క్రికెట్ ప్రపంచకప్‌లో స్టేడియంకు హాజరైన ప్రేక్షకుల సంఖ్య ఇప్పటికే పది లక్షలు దాటిందని ఐసీసీ వెల్లడించింది. ఐసీసీ నిర్వహించిన టోర్నీలలో ఇదే అత్యధిక హాజరు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో శుక్రవారం దక్షిణాఫ్రికా-అఫ్గానిస్థాన్ మ్యాచ్ సందర్భంగా ఈ రికార్డు నమోదైనట్టు ఐసీసీ తెలిపింది. ప్రస్తుత మెగాటోర్నీ డిజిటల్ వీక్షకుల సంఖ్యలో రికార్డు సాధించిన సంగతి తెలిసిందే. మరో మూడు లీగ్ మ్యాచ్‌లు, మూడు నాకౌట్ మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ఈ రికార్డు నమోదైందని, టోర్నీ ముగిసేసరికి మరిన్ని రికార్డు నమోదయ్యే అవకాశం ఉందని ఐసీసీ ఈవెంట్స్ హెడ్ క్రిస్ టెట్లే అన్నారు.

రన్నరప్ శౌర్య

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ యువ టెన్నిస్ ప్లేయర్ శౌర్య ఐటీఎఫ్ వరల్డ్ జూనియర్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచాడు. ఆఫ్రికా వేదికగా జరిగిన టోర్నీలో అండర్-18 విభాగంలో బరిలోకి దిగిన పదిహేనేండ్ల శౌర్య నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో శౌర్య 2-6, 4-6తో డానియల్ చేతిలో పరాజయం పాలయ్యాడు. అంతకుముందు తొలి రౌండ్‌లో 6-1, 6-2తో రూబెన్‌పై, ప్రిక్వార్టర్స్‌లో 6-1, 6-3తో ఆంటోనీ బిక్జీపై, క్వార్టర్స్‌లో 6-4, 4-6, 6-3తో ఎమెర్సన్ పెడ్రోపై, సెమీఫైనల్లో 5-7, 6-2, 6-4తో రాబర్టో మటుండోపై గెలిచిన శౌర్య తుదిపోరులో అదే జోరు కొనసాగించలేకపోయాడు.

ధీరజ్‌కు ఒలింపిక్ బెర్త్

బాంకాక్: తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర ఆర్చరీలో భారత్‌కు తొలి ఒలింపిక్ బెర్త్‌ను ఖాయం చేశాడు. ఆసియన్ కాంటినెంటల్ అర్హత టోర్నీలో ధీరజ్ రజత పతకం సాధించడం ద్వారా ఆర్చరీలో భారత్‌కు తొలి ఒలింపిక్ బెర్త్‌ను అందించాడు. ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరిన ఇద్దరికి ఒలింపిక్స్ బెర్త్‌లు లభించనున్న నేపథ్యంలో ఫైనల్‌కు చేరిన ధీరజ్ 5-6 తేడాతో చైనీస్ తైపీ ఆర్చర్ జిహ్ సియాంగ్ లింగ్ చేతిలో ఓడి రజతంతో సంతృప్తి చెందాడు. అంతకుముందు ధీరజ్ క్వార్టర్‌ఫైనల్లో ఇరాన్‌కు చెందిన సదేగ్ అష్రఫ్ బావిలిపై 6-0తో, సెమీస్‌లో మరో ఇరానియన్ ఆర్చర్ మొహ్మదొసీన్ గోల్షానిపై 6-0తో గెలుపొందాడు.

అంపైర్ల నిర్ణయం సరైనదే: ఎంసీసీ

లండన్ : బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో శ్రీలంక బ్యాటర్ మాథ్యూస్‌ను అంపైర్లు టైమ్ అవుట్‌గా తీసుకున్న నిర్ణయం సరైందేనని మెల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) సమర్థించింది. మాథ్యూస్ కొత్త హెల్మెట్‌కోసం అంపైర్లను సంప్రదించి ఉండాల్సిందని ఎంసీసీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. అంతర్జాతీయ క్రికెట్‌లో టైమ్ అవుట్‌గా వెనుదిరిగిన తొలి బ్యాటర్‌గా మాథ్యూస్ నిలిచిన విషయం తెలిసిందే.

మార్ష్ (177*)

బంగ్లాపై ఆస్ట్రేలియా విజయం

మార్ష్ మెరుపులు

పుణె: ఆల్‌రౌండర్ మిషెల్ మార్ష్ (132 బంతుల్లో; 177 నాటౌట్; 17 ఫోర్లు, 9 సిక్సర్లు) భారీ సెంచరీతో చెలరేగడంతో ఆస్ట్రేలియా వరుసగా ఏడో విజయం ఖాతాలో వేసుకుంది. శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా జరిగిన తొలి పోరులో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. మెగాటోర్నీలో తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయాల తర్వాత ఆసీస్ అజేయంగా నిలుస్తూ.. 14 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంతో లీగ్ దశను ముగించింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది. తౌహిద్ (74) టాప్ స్కోరర్ కాగా.. తన్జిద్ (36), లిటన్ దాస్ (36), నజ్ముల్ (45), మహ్ముదుల్లా (32), ముష్ఫికర్ (21), మెహదీ హసన్ (29) తలా కొన్ని పరుగులు చేశారు. ఆసీస్ బౌలర్లలో అబాట్, జాంపా చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆసీస్ 44.4 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 307 పరుగులు చేసింది. మార్ష్ భారీ సెంచరీకి తోడు వార్నర్ (53), స్మిత్ (63 నాటౌట్) హాఫ్‌సెంచరీలతో రాణించారు. బంగ్లా బౌలర్లలో తస్కిన్, ముస్తఫిజుర్ చెరో వికెట్ తీశారు. మార్ష్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది. గురువారం కోల్‌కతా వేదికగా జరుగనున్న రెండో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాతో ఆస్ట్రేలియా అమీతుమీ తేల్చుకోనుంది.

శనివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న పాల్వాయి స్రవంతి

కాంగ్రెస్‌లో ఉన్నది బ్రోకర్లే

- హస్తం పార్టీలో నాటి విలువలు, విధానాలు అస్సలు లేవు
- నాకు తెలియకుండానే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు
- ప్రజలను ఆదుకుంటున్నది బీఆర్ఎస్సే
- నా రాజీనామా లేఖను సోనియాగాంధీకి పంపించా
- మీడియాతో మునుగోడు కాంగ్రెస్ ఇన్‌చార్జి పాల్వాయి స్రవంతి

హైదరాబాద్ సిటీబ్యూరో/ఖైరతాబాద్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో ఉన్నది కార్పొరేట్లు, బ్రోకర్లేనని ఆ పార్టీ మునుగోడు ఇంచార్జి పాల్వాయి స్రవంతి ఆరోపించారు. పార్టీలో నాటి విలువలు, విధానాలు లేవని విమర్శించారు. ఓడిన వ్యక్తికి టికెట్ ఇచ్చి తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీని వీడి వెళ్లిపోయిన రాజగోపాల్‌రెడ్డిని తిరిగి చేర్చుకుని 24 గంటల్లో టికెట్ ఇచ్చారని పేర్కొన్నారు. మునుగోడు ఇంచార్జిగా ఉన్న తనకు మాత్రం ఈ విషయంలో సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతండ్రి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి పార్టీకి చేసిన సేవలను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. పీసీసీ హోదాలో ఉన్న వ్యక్తి స్వయంగా పార్టీ విధానాలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో తన తండ్రి అనేక త్యాగాలు చేశారని, పార్టీ కోసం ఎన్నో అవమానాలు దిగమింగుకున్నారని తెలిపారు. తుదిశ్వాస వరకు పార్టీ కోసమే పనిచేశారని గుర్తు చేశారు. పార్టీలో మహిళలు, సీనియర్లకు స్థానం లేకుండా చేశారని ఆరోపించారు. టికెట్లు అమ్ముకునే స్థాయికి పార్టీ దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీని ఫిరాయించిన వారికే కిరీటాలు పెడుతున్నారని, పార్టీ చనిపోయిందన్న వారికే కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. పార్టీ తనను గుర్తిస్తుందని పది రోజులు చూశానని, అయినా ఫలితం లేకపోవడంతో పార్టీని వీడుతున్నట్టు తెలిపారు. రాజీనామా లేఖను సోనియాగాంధీకి పంపినట్టు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఒక్కటే సంక్షేమ పథకాలతో ప్రజలను ఆదుకుంటున్నదని ప్రశంసించారు. అనుచరులు, కార్యకర్తల సలహా మేరకు భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని స్రవంతి తెలిపారు.

అడుగు దూరంలో ఆర్టీసీ 'విలీనం'

- చట్టం అమలుకు ఎన్నికల కోడ్ అడ్డు
- ఈసీ అనుమతి కోరిన రవాణాశాఖ
- ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తే 'అపాయింటెడ్ డేట్' ఖరారు
- గెజిట్ వెలువడిన నాటినుంచే ప్రభుత్వ ఉద్యోగులుగా సిబ్బంది
- ఎన్నికల కమిషన్ సానుకూలంగా స్పందించాలి: టీఆర్ఎంయూ

హైదరాబాద్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): ఆర్టీసీ ఉద్యోగుల జీవితాలకు ఓ భరోసా అందించాలనే ఉద్దేశంతో వారిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం చివరి అంకానికి చేరింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ అసెంబ్లీ చేసిన చట్టాన్ని తక్షణమే అమలుచేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు ఎన్నికల కోడ్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ రవాణాశాఖ అధికారులు ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి రాగానే 'అపాయింటెడ్ డేట్'ను ఖరారు చేయాలని నిర్ణయించారు. అపాయింటెడ్ డేట్‌ను ఖరారుచేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన తేదీనుంచే ఆర్టీసీ సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతారు.

ఈసీ అనుమతి కోసం ఎదురుచూపులు

రాష్ట్రంలోని 43 వేల మంది ఆర్టీసీ ఉద్యోగుల జీవితాలకు ఓ శాశ్వత భరోసాను కల్పించేందుకు ప్రభుత్వం వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఒక బిల్లును గత జూలై 31న రాష్ట్ర మంత్రిమండలి ఏకగ్రీవంగా ఆమోదించగా, ఆగస్టు ఆరున అసెంబ్లీ కూడా ఆమోద ముద్ర వేసింది. దీనిపై సెప్టెంబర్ 15న న్యాయశాఖ ద్వారా గెజిట్ పబ్లికేషన్ వెలువడింది. ఈ చట్టం అమలు తేదీ(అపాయింట్ డేట్)ని ఖరారుచేస్తూ రవాణాశాఖ పరిపాలనా విభాగం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన సమయంలో అక్టోబర్ 9న ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. తక్షణమే ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో విలీన ప్రక్రియ చివరిదశలో నిలిచిపోయింది.

ఎన్నికల నియమావళితో బ్రేకులు

తొలుత రాష్ట్ర గవర్నర్ ఈ బిల్లుపై కొర్రీలు వేస్తూ జాప్యం చేసినప్పటికీ చివరికి ఆమోద ముద్ర వేయడంతో ఆర్టీసీ ఉద్యోగుల కష్టాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు మార్గం సుగమం అయింది. ఈ క్రమంలో విలీన ప్రక్రియ కొనసాగుతుండగానే, ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ రూపంలో ఆర్టీసీ ఉద్యోగుల చిరకాల స్వప్నానికి మరోసారి బ్రేకులు పడ్డాయి. ఆర్టీసీ ఉద్యోగుల జీవితాలకు ఓ భరోసా అందించాలనే ఉద్దేశంతో నష్టాల్లో ఉన్న సంస్థను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొదటినుంచీ పలు రకాల ప్రయత్నాలు చేసింది. చివరికి వారిని ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయానికొచ్చింది.

ఎన్నికల కమిషన్ సానుకూలంగా స్పందించాలి: టీఆర్ఎంయూ

ఇప్పటికే అసెంబ్లీలో చట్టం అయినందున అపాయింటెడ్ డేట్ ఖరారు చేసేందుకు ఎన్నికల నియమావళి అడ్డంకి కారాదని ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల చిరకాల స్వప్నమైన ఈ అంశంపై ఎన్నికల కమిషన్ సానుకూలంగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని యూనియన్ అధ్యక్షుడు ఆర్‌కే రెడ్డి, ప్రధాన కార్యదర్శి థామస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ యాదయ్య తదితరులు విజ్ఞప్తిచేశారు.

రేవంత్ మళ్లీ నోటి దురుసు

- సీఎంపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు
- ఓటు హక్కేలేని ముఖ్యమంత్రి మనువడిపై తలతిక్క మాటలు
- బెల్లంపల్లి సభలో అజ్ఞానం చాటుకున్న పీసీసీ చీఫ్

బెల్లంపల్లి, నవంబర్ 11: పీసీసీ అధ్యక్షుడు రేవంత్ నోటికి అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. సీఎం కేసీఆర్‌పై పత్రికల్లో రాయడానికి వీల్లేనివిధంగా రోతభాష ఉపయోగిస్తున్నారు. రోజుకో చోట రోజుకో రీతిలో అసభ్యకర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తూ తన అల్పబుద్ధిని చాటుకుంటున్నారు. ఇప్పటికే రైతులను బిచ్చగాళ్లని, ఓయూ విద్యార్థులను తాగుబోతులని తూలనాడిన రేవంత్.. మక్తల్, కామారెడ్డి సభల్లో కేసీఆర్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. తన వ్యాఖ్యలను సభ్యసమాజం గర్హిస్తున్నా, సొంత కార్యకర్తలే తప్పుబడుతున్నా అవేవీ పట్టించుకోకుండా నోటి దురుసు కొనసాగిస్తున్నారు. శనివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సభలో కేసీఆర్‌పై అర్థంపర్థం లేని వ్యాఖ్యలు చేశారు. తన మనవడిని మంత్రిని చేసేందుకే కేసీఆర్ మూడోసారి అధికారం కోసం ప్రయత్నిస్తున్నారంటూ తలతిక్కగా మాట్లాడారు. నిజానికి కేసీఆర్ మనువడు ప్రస్తుతం ఇక్కడ లేడని, చదువుకోవడానికి అమెరికా వెళ్లాడని, కనీసం ఇంకా ఓటుహక్కు కూడా రాలేదన్న స్పృహ లేకుండా అభాండాలు వేయడం, నోటి దురుసు ప్రదర్శించడం రేవంత్‌కే చెల్లింది. ఓటు హక్కే లేని పిల్లాడిని మంత్రిని చేయడం ఎలా సాధ్యమవుతుందని ఆ సభకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలే చర్చించుకోవడం గమనార్హం. 30న జరిగే పోలింగ్‌లో ఘోర పరాజయం తప్పదన్న భయం, ఫ్రస్టేషన్‌తోనే రోజుకోరకంగా దిగజారుతూ తలతిక్క వ్యాఖ్యలు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రేవంత్.. బీసీలకు సీట్లేవి?

హైదరాబాద్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ): 'బీసీలకు బీఆర్ఎస్ కన్నా ఎక్కువ సీట్లే ఇస్తాం తప్ప తక్కువ ఇవ్వం' అంటూ ఢాంబికాలు పలికిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ ఆఖరికి తుస్సుమనిపించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ బీసీలకు 23 స్థానాల్లో టికెట్లు ఇవ్వగా కాంగ్రెస్ అంతకంటే ఒకటి తక్కువే ఇచ్చింది. నారాయణఖేడ్‌లో బీసీ బిడ్డ సురేశ్‌షెట్కార్‌కు ఇచ్చిన టికెట్‌ను ఆఖరి క్షణంలో రద్దు చేసి దానిని సంజీవ రెడ్డికి కట్టబెట్టింది. బీసీలకు కేటాయించిన 22 సీట్లలో సగం సీట్లు ఓడిపోయేవేనని ఆ పార్టీ బీసీ నేతలే పెదవివిరుస్తున్నారు. బీసీలకు టికెట్లు ఇవ్వలేదనే అపవాదు రాకుండా ఉండేందుకు ఆ సీట్లను కట్టబెట్టారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బీసీల డిమాండ్ బేఖాతర్

ఈ ఎన్నికల్లో తమకు పార్లమెంట్ నియోజకవర్గానికి రెండు టికెట్ల చొప్పున కనీసం 34 సీట్లు కేటాయించాలని పార్టీలోని బీసీ నేతలు డిమాండ్ చేశారు. ఇందుకోసం బీసీ సీనియర్ నేతలు వీహెచ్, మధుయాష్కీ, పొన్నం ప్రభాకర్, పొన్నాల లక్ష్యయ్య, కత్తి వెంకటస్వామి వంటి వారు అధిష్ఠానంపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. కానీ వారి కోరికను అధిష్ఠానం పట్టించుకోకపోగా, ఢిల్లీ వెళ్లిన బీసీ నేతలను తీవ్రంగా అవమానించింది.

బీఆర్ఎస్‌కే ఎరుకల మద్దతు

- కారు గుర్తుకు ఓటేయాలని రాష్ట్ర కమిటీ ఏకగ్రీవ తీర్మానం
- కేసీఆర్‌నే హ్యాట్రిక్ సీఎంను చేస్తాం
- బీఆర్ఎస్‌తోనే ఎరుకల అభివృద్ధి
- కాంగ్రెస్ మమ్మల్ని పట్టించుకోలేదు
- ఎరుకల సంఘం (కురు) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కుర్రా సత్యనారాయణ

రవీంద్రభారతి, నవంబర్ 11: రాష్ట్రంలోని ఎరుకల కులస్థులు బీఆర్ఎస్ పార్టీకే మద్దతు ప్రకటించారు. కారు గుర్తుకు ఓటేస్తామని, కేసీఆర్‌నే హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేస్తామని స్పష్టంచేశారు. ఈ మేరకు తెలంగాణ ఎరుకల సంఘం (కురు) రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎరుకల జాతి మొత్తం ఓట్లు వేసి గెలిపించి సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని ఎరుకల సంఘం (కురు) రాష్ట్ర కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కుర్రా సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి రాములు, ప్రధాన కార్యదర్శి లోకిని రాజు పిలుపునిచ్చారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కుర్రా సత్యానారాయణ మాట్లాడుతూ.. ఇప్పటివరకు కాంగ్రెస్, టీడీపీ ఎరుకల జాతిని పట్టించుకోలేదని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎరుకల జాతి ఆత్మగౌరవ భవనం కోసం ఎకరం భూమితోపాటు నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించారని చెప్పారు. పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న 50 వేల ఎరుకల కుటుంబాల అభివృద్ధికి తొలిసారిగా ఎరుకల ఎంపవర్‌మెంట్ పథకం ప్రవేశపెట్టి రూ.60 కోట్ల నిధులు కేటాయించిందని కేసీఆర్ ప్రభుత్వమేనని తెలిపారు. కుల దేవత ఎరుకల నాంచారమ్మ జాతర కోసం ఏటా ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నదని గుర్తుచేశారు. ఎమ్మెల్సీగా కూడా తనకు కేసీఆర్ అవకాశం కల్పించారని సత్యనారాయణ